

ప్రముఖ సాహితీవేత్త ప్రాణ్‌రావుకు సాహితీ సేవా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న కేవీ రమణాచారి తదితరులు

## ఎంఎల్. నరసింహారావు కృషి ఎనలేనిది

● డాక్టర్ కె.వి. రమణాచారి.

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 14: తెలుగు భాషా సాహిత్యాల పరిరక్షణకు నిరంతరం తపించిన ఎం.ఎల్. నరసింహారావు కృషి ఎనలేనిదని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి కొనియాడారు. సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త, భాషా నిలయం అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎల్. నరసింహారావు జయంతి సభ మంగళవారం సాయంత్రం భాషా నిలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎల్. నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో తెలుగు భాషా సాహిత్యానికి విశేషంగా కృషి చేస్తున్న ప్రముఖ రచయిత, కవి ప్రాణ్‌రావ్‌కు డాక్టర్ ఎం.ఎల్. నరసింహారావు సాహితీ సేవా పురస్కారాన్ని ప్రదానం చేసి, సత్కరించారు. తరతరాల తెలుగు ప్రముఖులు గ్రంథాన్ని రమణాచారి ఆవిష్కరించారు. బాలల దినోత్సవం సందర్భంగా భాషా నిలయం నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ తెలుగుశాఖ పూర్వ ఆచార్యులు డాక్టర్ ఎస్.వి. రామారావు, భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి. ఉడయవర్లు, ఉపాధ్యక్షులు కె.చంద్రప్రకాశ్ రావు, సాహితీవేత్త బి.ఆర్. రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్త డా.శ్రీనివాస్ శర్మకు.. సీతారాం రుంగ్తా స్మారక పురస్కారం



ఉప్పల్, నవంబర్ 14 : జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ చీఫ్ సైంటిస్టు డాక్టర్ ద్రోణ శ్రీనివాస్ శర్మ ప్రతిష్టాత్మకమైన సీతారాం రుంగ్తా స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు భువనేశ్వర్‌లోని సొసైటీ ఆఫ్ జియో సైంటిస్ట్స్ అండ్ అలైడ్ టెక్నాలజీస్ నుంచి 2023 పురస్కారం అందుకున్నారు. ఖనిజ అన్వేషణ, బంగారు లోహశాస్త్ర రంగంపై చేసిన కృషికి అవార్డును పొందారు. భారతీయ బంగారు నిక్షేపాలపై కాల పరిమితులను అందించిన మొదటి వ్యక్తిగా డా.శర్మ నిలిచారు. డా.శర్మ చేసిన పరిశోధనలు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన జర్నల్స్‌లోనూ ప్రచురించారు. యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోగా ఉన్నారు. కెనడాలోని అల్బెర్టా విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మక రామన్ రీసెర్చ్ ఫెలో షిప్ కింద పని చేశారు. తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్సెస్ ఫెలోగా కూడా ఉన్నారు. 2022లో ప్రతిష్టాత్మక జాతీయ భూవిజ్ఞాన పురస్కారాన్ని అందుకున్నారు. పురస్కారానికి ఎంపిక కావడంపై పలువురు శాస్త్రవేత్తలు ఆయనను అభినందించారు.

## ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారు స్వామి



మాట్లాడుతున్న పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా

ముషీరాబాద్, నవంబర్ 14: తెలంగాణ సాయుధ పోరాటంలో పాలు పంచుకొని జైలు జీవితం గడిపిన వట్టికోట ఆళ్వారు స్వామి గ్రంథాలయాల అభివృద్ధికి విశేషంగా కృషిచేసి ప్రజల మనిషిగా నిలిచారని పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా మంగళవారం ప్రముఖ రచయిత, గ్రంథాలయోద్యమ నాయకుడు వట్టికోట ఆళ్వారు స్వామి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి కోలేటి దామోదర్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై.. ఆళ్వారు స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆళ్వారు స్వామి నవలా రచన తెలంగాణ ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులకు దర్పణంగా నిలిచిందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జయసూర్య, గుదిబండి వెంకటరెడ్డి, తాళ్లపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ బిల్డర్ ఫెడరేషన్ (టీబీఎఫ్) నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

# ప్రతిరోజూ నీళ్లిస్తాం..

## వచ్చే టర్మ్‌లో ఇదే మా కమిట్‌మెంట్

- ఎప్పుడు ట్యాప్ తిప్పినా.. 24 గంటలు నీళ్లు రావాలి
- ఓఆర్‌ఆర్– ఆర్‌ఆర్‌ఆర్ మధ్యలో సరికొత్త హైదరాబాద్ ఆవిష్కృతం
- బెంగళూరును మించి హైదరాబాద్‌కు సోషల్ ఇన్‌ఫ్రా ప్లాన్ చేస్తాం
- నిర్మాణ రంగ అనుమతుల్లో సింగిల్ విండో అమలు చేస్తాం
- బోడుప్పల్‌లో వక్ఫ్ స్థలాల సమస్యను పరిష్కరిస్తాం
- ప్రగతి, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ రావాలి
- టీబీఎఫ్ సమావేశంలో మంత్రి కల్వకుంట్ల తారక రామారావు

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ): హైదరాబాద్ అభివృద్ధిపై ఇప్పటి వరకు చూసింది ట్రైలర్ మాత్రమేనని.. అసలు సినిమా ముందుందని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. త్వరలో 300 కిలోమీటర్ల రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) రాబోతున్నదని, ఓఆర్‌ఆర్‌కు ఆర్‌ఆర్‌ఆర్‌కు మధ్య కొత్త హైదరాబాద్ ఆవిష్కృతం అవుతుందని కేటీఆర్ చెప్పారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన తెలంగాణ బిల్డర్ ఫెడరేషన్ (టీబీఎఫ్) సమావేశానికి మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చైనాలోని బ్రీజింగ్ నగరానికి ఐదు రింగ్ రోడ్లు ఉన్నాయని, ఆర్‌ఆర్‌ఆర్ వస్తే మనకు మూడు రింగు రోడ్లు ఉంటాయన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ అవతల మరో రింగు రోడ్డు రావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు మరింత ఈజీగా ఉంటుందన్నారు. గతంలో 14 రోజులకు ఒకసారి నీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగునీటిని అందిస్తున్నామని చెప్పారు. వచ్చే టర్మ్‌లో ప్రతి రోజు ఇంటింటికి నల్లా నీళ్లు ఇస్తామని, ఎప్పుడు ట్యాప్ తిప్పినా 24 గంటలు తాగునీరు సరఫరా చేస్తామని కేటీఆర్ చెప్పారు. ఇది తమ కమిట్‌మెంట్ అని, తప్పకుండా చేస్తామన్నారు. ప్లాన్డ్ హైదరాబాద్‌లో భాగంగా బెంగళూరుకు మించి హైదరాబాద్‌కు సోషల్ ఇన్‌ఫ్రా పెంచాల్సిన అవసరం ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు.

నిర్మాణ రంగ అనుమతుల్లో భాగంగా డిసెంబర్ 3 తర్వాత సింగిల్ విండో అమలు చేసి.. ఎన్‌వోసీ లాంటి సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని మంత్రి కేటీఆర్ తెలిపారు. నాలా, చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉన్నా సవరిస్తామని చెప్పారు. బోడుప్పల్‌లో వక్ఫ్ స్థలాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. హైదరాబాద్, తెలంగాణ గొప్పతనం ఇక్కడున్న వారికి అర్థం కాదన్నారు. తెలంగాణలో మౌలిక సదుపాయాలు, టీఎస్ బీ పాస్ లాంటి విధానాలను చూసి మహారాష్ట్ర బిల్డర్స్ ఆశ్చర్యపోయారని తెలిపారు. మన బిల్డర్లు కూడా ఇతర రాష్ట్రాలలో పర్యటించి వస్తే కానీ మన అభివృద్ధి కనబడదని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతను నిర్వర్తించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. పోలింగ్ రోజును హాలిడేగా చూడకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిల్డర్లు వచ్చే 15 రోజుల పాటు తమ వినియోగదారులు, ఇన్వెస్టర్లతో కలిసి ఓటు హక్కుపై చైతన్యం కల్పించాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్ నగరంలో కులం పేరుతో కుంపట్లు ..మతం పేరుతో మంటలు లేకుండా.. అభివృద్ధి మా కులం, సంక్షేమమే మా మతం.. అంటూ ముందుకు పోతున్నామని కేటీఆర్ అన్నారు. ఈ ప్రగతి, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలని కేటీఆర్ అన్నారు.

### బీఆర్‌ఎస్‌కే మా మద్దతు ..

జంట నగరాల నుంచి వందలాది మంది బిల్డర్లు ఈ సమావేశంలో పాల్గొనగా.. రియల్ ఎస్టేట్ వృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, విప్లవాత్మకమైన నిర్ణయాలే కారణమని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో రియల్ ఎస్టేట్ పడిపోతుందని ఎన్నో అనుమానాలు, అపోహలు సృష్టించారని, సీఎం కేసీఆర్ ఆదిలోనే రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి కీలక జీవోలు ఇచ్చి రియల్ ఎస్టేట్‌ను అగ్రగామిగా నిలిపారన్నారు. ఇతర మెట్రో నగరాల కంటే హైదరాబాద్‌లోనే రియల్ ఎస్టేట్ మంచి డిమాండ్ ఉన్నదని, ముఖ్యంగా నిర్మాణ రంగ అనుమతుల విషయంలో పారదర్శకంగా, నిర్ణీత సమయంలో పర్మిషన్లు వస్తున్నాయని టీబీఎఫ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పక్షాన నిలబడిన అభ్యర్థులను గెలిపించుకుంటామని ఈ సందర్భంగా టీబీఎఫ్ ప్రతినిధులు మద్దతును ప్రకటించారు.

## పరవస్తు, రామ్ కీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో.. కేంద్రప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ తదితర విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్–రామ్‌కీ ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో ఉచితంగా అందించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సాయుధ బలగాల నియామకానికి కేంద్ర ప్రభుత్వం త్వరలో 80 వేలకు పైగా కానిస్టేబుళ్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నది. 10వ తరగతి ఉత్తీర్ణులై.. 18 నుంచి 23 ఏండ్లలోపు ఉన్న ఓసీ అభ్యర్థులు, 26 ఏండ్లలోపు ఓబీసీ, 28 ఏండ్లలోపు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన 600 మంది అభ్యర్థులకు హైదరాబాద్, గుంటూరులో ఉన్న నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణ, ఏపీలోని కొన్ని కేంద్రాల్లో ఈనెల 26న అర్హత పరీక్ష నిర్వహించి, 29న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. డిసెంబర్ 2 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులకు శిక్షణతోపాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేయనున్నట్లు ఫౌండేషన్ల ప్రతినిధులు ఎంవీ. రామిరెడ్డి, భాస్కర్, సందీప్ తెలిపారు. పూర్తి సమాచారం కోసం https://qrco.de/beX6aw, www.paravasthu.org లింక్.. లేదా 97036 51233, 73375 85959, 90007 97789 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



## అందం.. అభినయం కలిగిన గొప్ప నటీమణి జమున

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- జమునా రమణా.. పద్య సంపుటి ఆవిష్కరణ

బంజారాహిల్స్, నవంబర్ 14: అందంతో పాటు అభినయం, అభిమానం, అభిజాత్యం కలిగిన గొప్ప నటీమణి జమున అని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. సినీ రంగస్థల నటుడు డా.అక్కిరాజు సుందర రామకృష్ణ రచించిన 'జమునా రమణా..' కంద పద్య సంపుటిని మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కందపద్యం తెలుగువారికి అత్యంత ఇష్టమైన పద్య ప్రక్రియ అని, అలాంటి కంద పద్య ప్రక్రియలో మేటి నటీమణి జమున పద్యశతిని రచించడం అభినందనీయమన్నారు. జమున అందంతో పాటు అభినయంతో ఇతర నటీ నటులతో పోటీ పడేవారన్నారు. ఈ సందర్భంగా సినీ పాత్రికేయుడు ఇమంది రామారావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్, ఏఎన్‌ఆర్‌లతో పోటీపడి అనేక చిత్రాల్లో నటించిన జమున.. ఎంతో మంది పేద కళాకారులకు అవకాశం కల్పించడంతో పాటు జీవనభృతి కూడా ఇచ్చేవారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అనురాధాదేవి, జమున కుమార్తె స్రవంతి, ఫిక్కీ సీఎండీ అచ్యుత జగదీశ్ చంద్ర, ఆకృతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.